క్లుప్తంగా

త్రిపుర గవర్నర్‌ను కలిసిన గానుగుబండ వాసులు



త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డితో గానుగుబండ గ్రామస్తులు

తుంగతుర్తి : త్రిపుర గవర్నర్‌గా నియమితులైన నల్లు ఇంద్రసేనారెడ్డిని మంగళవారం గానుగు బండ గ్రామస్తులు హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. సన్మానించిన వారిలో సర్పంచ్ నల్లు రామచంద్రారెడ్డి, దుర్గయ్య, శ్రీహరి, వీరన్న, సూర్యప్రకాష్, ప్రవీణ్, సతీష్, లక్ష్మయ్య ఉన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



బీజేపీలోకి ఆహ్వానిస్తున్న సంకినేని

దురాజ్‌పల్లి : సూర్యాపేట, కుడకుడ, ఆత్మకూర్ (ఎస్) మండలం కొత్తగూడెం, ఏపూర్, బోడతండా గ్రామాలకు చెందిన సుమారు 60 మంది మంగళవారం బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సంకినేని వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీలో చేరిన వారిలో గురువయ్య, వెంకన్న, రామచంద్రు, అశోక్, గుండాల గురవయ్య, గుండాల వెంకన్న, వీరబోయిన కృష్ణ, బత్తుల పుల్లయ్య, మల్లేష్, సాగర్, శ్రీకాంత్, రాజశేఖర్, రమేష్, రాములు, లాల్ సింగ్, ఉపేందర్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికే టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న గుడిపాటి నర్సయ్య

తుంగతుర్తి : నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికే పార్టీ టికెట్ ఇవ్వాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడిపాటి నర్సయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తాను 20ఏళ్లుగా రాంరెడ్డి దామోదర్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటూ ముందుకెళ్లానని అన్నారు. ఆయనతో పాటు శ్రీరంగం, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



సంగెం గ్రామంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తుంగతుర్తి : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గొట్టిపర్తి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే తుంగతుర్తి, గుడితండా, కేశవపురం, గొట్టిపర్తి, అన్నారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, దొంగరి శ్రీను, కేతిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి, జనార్దన్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకే ముస్లిం మైనార్టీల మద్దతు

అర్వపల్లి : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ముస్లిం మైనార్టీల మద్దతు ఉంటుందని మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు, ఆ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ హమీద్ చెప్పారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని తెలిపారు. తుంగతుర్తి అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడోసారి బరిలో ఉన్న గాదరి కిషోర్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బీఎస్పీలో చేరిక

భానుపురి : ఇమాంపేట గ్రామానికి చెందిన మాజీ గౌడ సంఘం అధ్యక్షుడు అల్దాస్ సాయిలుగౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మంగళవారం వట్టె జానయ్యయాదవ్ సమక్షంలో బీఎస్పీలో చేరారు. అలాగే సూర్యాపేట టౌన్ 17వ వార్డు చింతలచెర్వు నుంచి అలువాల ప్రవీణ్ ఆధ్వర్యంలో పలువురు యువకులు బీఎస్పీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఉదయ్, నాగరాజ్, ప్రేమ్ కుమార్, మల్సూర్, అశోక్, 34వ వార్డ్ చర్చ్ కాంపౌండ్ నుంచి గద్దల పురుషోత్తం పాల్గొన్నారు.



బీఎస్పీలో చేరుతున్న యువకులు

అయోమయంలో కాంగ్రెస్ కేడర్

- అభ్యర్థిని ప్రకటించకపోవడంతో నాయకులు, కార్యకర్తల నిరీక్షణ
- నామినేషన్లకు మూడు రోజుల్లో ముగియనున్న గడువు



అర్వపల్లి : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఓ పక్క నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై మరో మూడు రోజుల్లో గడువు ముగియనుంది. అయితే ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు ఈనెల 9న నామినేషన్లు వేయడానికి తగు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈనెల 10వ తేదీతో నిమినేషన్ల గడువు ముగియనుంది. కాగా బీఎల్ఎఫ్, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఇప్పటికే కొందరు నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ మినహా అన్ని పార్టీలకు అభ్యర్థులను ప్రకటించారు. కానీ తుంగతుర్తి అసెంబ్లీ అభ్యర్థిని కాంగ్రెస్ ఇంత వరకు ప్రకటించకపోవడంతో ఆ పార్టీ కేడర్‌లో స్తబ్దత నెలకొంది. అయితే బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో ముందంజలో ఉన్నారు. కాగా బీజేపీ అభ్యర్థి కడియం రామచంద్రయ్య కూడా ఊరూరా ప్రచారం ముమ్మరం చేశారు. డీఎస్పీ, బీఎల్ఎఫ్ అభ్యర్థులు బాలస్వామి, వీరపాపయ్యలు కూడా ప్రచారం చేస్తున్నారు. కానీ కాంగ్రెస్ అభ్యర్థిని ఇంత వరకు అధిష్టానం తేల్చలేదు. అయితే కాంగ్రెస్ నుంచి టికెట్ కోసం 23 మంది దరఖాస్తు చేసుకున్నారు. టికెట్ కోసం ఎవరికి వారే ప్రయత్నాలు చేసుకుంటున్నారు. దరఖాస్తుదారులు నిత్యం ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారు. నామినేషన్ గడువు దగ్గర పడుతున్నా అభ్యర్థిని తేల్చకపోవడంతో ఆ పార్టీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు.

తీవ్ర నిరాశలో పార్టీ శ్రేణులు..

పార్టీ అభ్యర్థి ప్రకటన కోసం కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర నిరాశగా ఎదురు చూస్తున్నారు. టికెట్ కేటాయింపు ఇంతగా జాప్యం చేస్తే టికెట్ దక్కించుకున్న వ్యక్తి పూర్తి స్థాయిలో ప్రచారానికి ఎలా వెళతారు.. ఎలా ఓటర్లను కలుపుకొని ఓటు కోరతాడనే అనుమానం వ్యక్తమవుతోంది. టికెట్ కోసం పోరాడి రాని వారిని దారికి తెచ్చుకోవడానికి సమయం పట్టే పరిస్థితి ఉంది. ఆలస్యంగా టికెట్ తెచ్చుకున్న వారికి ఈ సమయంలో అనేక సవాళ్లు ఎదురుకానున్నాయి. అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుంది.. ఎలా వ్యవహరిస్తుందనే విషయమై సర్వత్ర ఆసక్తి నెలకొంది.

అభివృద్ధిని చూసి ఆదరించాలి



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కిషోర్



బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

తిరుమలగిరి : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను మూడోసారి గెలిపించాలని తుంగతుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి, శాసన సభ్యుడు గాదరి కిషోర్‌కుమార్ కోరారు. మంగళవారం తొండ, మర్రికుంట తండా, వెలిశాల, సిద్ధిసముద్రం, మొండిచింత తండా, రాజానాయక్ తండా, భోక్యా నాయక్ తండా, రాఘవపురం, గుండెపురి, కేఆర్‌కే తండా, బండ్లపల్లి, మాలిపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్ రెడ్డి, ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, జెడ్పీటీసీ దూపటి అంజలిరవీందర్, మార్కెట్ చైర్‌పర్సన్ కొమ్మినేని స్రవంతిసతీష్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనీరాజశేఖర్, సర్పంచ్‌లు శాతవాహనరావు, రవీందర్, శోభన్‌బాబు, మహేష్, ఆకుల వీరయ్య, ఎంపీటీసీ వెంకన్న, పట్టణ శాఖ అధ్యక్షుడు తిరుమని యాదగిరి, కౌన్సిలర్లు సరళా యాదవరెడ్డి, శ్రీలతారాములు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

నెల్లిబండ తండాకు చెందిన పలువురు మంగళవారం తిరుమలగిరిలో ఎమ్మెల్యే కిషోర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హరిశ్చంద్రనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



కుంచమర్తిలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ

అర్వపల్లి : అకాల వర్షాల దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తిమ్మాపురం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి నేరెళ్ల సత్యం కోరారు. మండల పరిధిలోని కుంచమర్తి, తిమ్మాపురం, అడివెంల తదితర గ్రామాల్లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిన రైతులు రాశులపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేస్తే ధాన్యం రంగు మారకుండా మొలకెత్త కుండా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు మన్నె సుజాత, రైతులు అలుగుబెల్లి సంజీవరెడ్డి, గుండగాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలి

నూతనకల్ : హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 11న నిర్వహించే మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాల్వాయి పరశురాములు కోరారు. మంగళవారం నూతనకల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే విశ్వరూప మహాసభకు ప్రధాని నరేంద్రమోదీ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. సభకు ప్రతి గ్రామం నుంచి మాదిగలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బత్తుల వెంకటనర్సు, నాగమల్లు, సురేష్, శ్రీను, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో అన్నదాతలకు తీవ్ర నష్టం

అర్వపల్లి : అకాల వర్షాలతో అన్నదాతలకు మళ్లీ నష్టం వాటిల్లింది. మండల వ్యాప్తంగా 10 రోజుల వ్యవధిలో ఇప్పటికే రెండుసార్లు అకాల వర్షాలు పడ్డాయి. తాజాగా సోమవారం రాత్రి వర్షం పడింది. రైతులు మండలంలో వానాకాలం సీజన్ నందు 20 వేల ఎకరాల్లో వరి పంటలు సాగుచేశారు. ఇందులో సగం వరకు వరిచేలు కోత అయ్యాయి. మిగిలిన వరిచేలు కోయాల్సి ఉంది. అకాల వర్షాలతో కోయని వరిపొలాలు నేలకొరిగాయి. మండలంలోని 20 కొనుగోలు కేంద్రాల్లో అమ్మడానికి పోసి ఉంచిన ధాన్యం తడిసిపోయింది. దీంతో అన్నదాతలు తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



అర్వపల్లిలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులపై నిలిచిన వర్షపు నీరు



వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు



అర్వపల్లి శివారులో వర్షానికి నేలకొరిగిన వరి

పలువురికి ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : కోడూరులో నిరుపేద కుటుంబానికి చెందిన చిలకబత్తిని సారంగం ఇటీవల మృతి చెందారు. దీంతో అతడి కుటుంబానికి మంగళవారం ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.22 వేలు, మృతుడి 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.11 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

రూ.10వేల ఆర్థికసాయం..

మండల పరిధిలోని వేల్పుచెర్ల గ్రామానికి చెందిన ఖమ్మంపాటి సులోచన, సంపతి సుశీల అనారోగ్యానికి గురికావడంతో గ్రామ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున రూ.10 వేలు ఆర్థికసాయంను మంగళవారం అందజేసినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఖమ్మంపాటి కరుణాకర్, ఉపసర్పంచ్ రాంబాబు, మార్కెట్ డైరెక్టర్ ఖమ్మంపాటి నరేష్, అశోక్, సంపతి కిరణ్, మధుసూదన్, సాంబయ్య, ప్రశాంత్, సైదులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండలపరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన తన్నీరు సైదులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మంగళవారం మృతుడి కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మామిడి అంజయ్య, దంతాల వెంకన్న, పొదిల నాగార్జున, సైదిరెడ్డి, వెంకన్న, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి : వేల్పుచెర్లలో ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



అర్వపల్లి : కోడూరులో మృతుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ట్రాక్టర్ యూనియన్ సభ్యులు

సీపీఎం సీనియర్ నాయకుడికి నివాళి

అర్వపల్లి : సీనియర్ నాయకుడు యాదగిరి మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. పర్సాయపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బొడ్డు గంగయ్య కుమారుడు, సీనియర్ నాయకుడు యాదగిరి మృతి చెందడంతో అతడి మృతదేహాన్ని మంగళవారం సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు చెరుకు యాకలక్ష్మి, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, జీఎంపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి వజ్జె వినయ్‌యాదవ్, శిగ వెంకన్న, ఎస్.అబ్బులు, బొడ్డు సైదులు, అరిగె వీరస్వామి, కె.భిక్షం, భిక్షపతి, కొమ్ము విజయ్, శిగ శ్రీను, బి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



యాదగిరికి నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగార్జున్‌రెడ్డి

అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్‌దే గెలుపు

తిరుమలగిరి : కాంగ్రెస్ పార్టీ తరఫున అభ్యర్థి ఎవరైనా తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలకుర్తి రాజయ్య, అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. తిరుమలగిరిలో బస్ డిపో, జూనియర్ కళాశాల అమలుకు నోచుకోలేదన్నారు. తుంగతుర్తిలో రుద్రమదేవి చెరువును రిజర్వాయర్‌గా మారుస్తామని చెప్పి అమలు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్, నాయకులు నాగం సుధాకర్‌రెడ్డి, కొంగరి గోవర్దన్, సుధాకర్, లింగయ్య, సత్యం, లింగయ్య, ఎండీ.హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బహుజన ముక్తి అభ్యర్థి రమేష్



నామినేషన్ దాఖలు చేస్తున్న మర్రి నేహామియా



నామినేషన్ దాఖలు చేస్తున్న మచ్చ వీరకుమారి

భానుపురి : సూర్యాపేట ఆర్వో పరిధిలో నాలుగవ రోజు మంగళవారం 9 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రజావాణి పార్టీ తరఫున లింగిడి వెంకటేశ్వర్లు, ధర్మసమాజ్ పార్టీ తరఫున చెరుకు కిరణ్ కుమార్, ధర్మ సమాజ్ పార్టీ తరఫున మచ్చ వీరకుమారి, యుగ తులసి పార్టీ తరఫున గుడిపల్లి మధూకర్ రెడ్డి, బహుజన ముక్తి పార్టీ తరఫున పల్లెటి రమేష్, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా మర్రి నేహామియా, ముప్పాని లింగారెడ్డిలు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందించారు.

తుంగతుర్తిలో ఒకరి నామినేషన్

తిరుమలగిరి : తుంగతుర్తి అసెంబ్లీ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా గుడిపాటి నర్సయ్య మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. నర్సయ్యతో పాటు ఈదుల వీరపాపయ్య, దేవరకొండ జానయ్య మరో రెండు సెట్లు నామినేషన్లు వేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి యాదగిరిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



నామినేషన్ వేస్తున్న లింగిడి వెంకటేశ్వర్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న కిరణ్‌కుమార్



తుంగతుర్తిలో నామినేషన్ వేస్తున్న నర్సయ్య

ముమ్మరంగా వరి కోతలు

- మబ్బులు పడుతున్న ఆకాశం
- ఆందోళనలో రైతులు



తిరుమలగిరిలో వరి కోస్తున్న హార్వెస్టర్

తిరుమలగిరి : మండల పరిధిలోని గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో వస్తున్న మార్పులు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రెండు రోజుల నుంచి ఆకాశంలో మబ్బులు పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు సోమవారం రాత్రి మండలంలో చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో రైతులు వరి పచ్చిగా ఉన్నప్పటికీ హార్వెస్టర్లతో వరికోతలను ముమ్మరం చేస్తున్నారు.

14 వేల 500ఎకరాల్లో సాగు..

వానా కాలం సీజన్‌కు గానూ తిరుమలగిరి మండలంలోని 17 గ్రామాల పరిధిలో 14వేల 500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. దీంతో ఈ సీజన్‌లో 4 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ముందస్తుగా వరి నాట్లు వేసిన రైతులు పది రోజుల నుంచి వరి కోతలు చేపట్టారు. ప్రస్తుతం హార్వెస్టర్ కిరాయి గంటకు రూ.1800 నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నారు. అయితే వాతావరణంలో వచ్చిన మార్పులతో రైతులు వరి కోతలను త్వరగా పూర్తి చేసేందుకు హార్వెస్టర్ల కోసం తిరుగుతున్నారు. దీనికి తోడు గ్రామాల్లో అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోళ్లను చేపట్టారు. ఇప్పటికే వరి పంటకు మొగిలి పురుగు, తెల్ల కంకి, అగ్గి తెగులు ఆశించడంతో దిగుబడి అనుకున్నంతగా రాకపోగా అకాల వర్షాలు మరింత నష్టం చేకూరుస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

బీఎస్పీ పట్టణ ఇన్‌చార్జ్‌గా గండూరి కృపాకర్



భానుపురి : బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు పార్టీ సూర్యాపేట పట్టణ ఇన్‌చార్జ్‌గా గండూరి కృపాకర్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండా భీమయ్య గౌడ్ ప్రకటించారు. ఈ సందర్భంగా గండూరి కృపాకర్ మాట్లాడుతూ బీఎస్పీ అభ్యర్థి వట్టె జానయ్య యాదవ్ గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు.

ఎన్నికల శిక్షణ వాయిదా

కోదాడ : పట్టణ పరిధిలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఓపీఓలకు జరగాల్సిన ఎన్నికల శిక్షణ వాయిదా పడిందని, మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని కోదాడ మండల విద్యాధికారి సలీం షరీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఆధార్ కేంద్రం లేక ఇబ్బందులు

- ఆధార్ సేవల కోసం పాత మండలాలపైనే ఆధారపడుతున్న మద్దిరాల మండలవాసులు
- మద్దిరాలలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని వేడుకోలు



తుంగతుర్తిలోని ఆధార్ సెంటర్‌లో ఉన్న జనం

మద్దిరాల : ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే మద్దిరాల నూతన మండలంగా ఏర్పడింది. కానీ మద్దిరాల మండల అయ్యి ఏళ్లు గడుస్తున్నా కొన్ని వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రం లేదు. దీంతో ప్రజలు ఆధార్ నమోదు కోసం పాత మండలాలనే ఆశ్రయించాల్సి వస్తోంది. ముఖ్యంగా ఇటీవల రేషన్ కార్డుకు ఈకేవైసీ చేసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో చాలా మంది ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. చిన్నపిల్లలకు గతంలో వేలిముద్రలు తీసుకోకపోవడంతో ఇప్పుడు వారికి వేలిముద్రలు నమోదు చేయడం తప్పనిసరి అవుతోంది. కానీ మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు వేరే మండలాలకు వెళ్తున్నారు. చివరకు అక్కడకు వెళ్లినా జనం ఎక్కువగా ఉంటుండడంతో పనులు కావడం లేదు. ఫలితంగా మండల ప్రజలు రోజుల తరబడి పక్క మండలాల్లోని ఆధార్ సెంటర్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఆధార్‌లో సమస్యల కారణంగా రేషన్ దుకాణాల్లో ఈకేవైసీ కావడంలేదని అంటున్నారు. ఆధార్ అప్‌డేట్ కోసం మద్దిరాల మండల ప్రజలు నూతనకల్లు, తుంగతుర్తి మండలాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా మద్దిరాల మండల కేంద్రంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది



మద్దిరాల మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో వేరే మండలాలకు వెళ్లాల్సి వస్తోంది. వెళ్లినా అక్కడ జనం ఎక్కువగా ఉంటుండడంతో వెంటనే పనులు కావడంలేదు. దీంతో రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది. మండల కేంద్రంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి.

– పాల్వాయి లింగయ్య, మద్దిరాల

ఎస్టీయూ మండల నూతన కమిటీ ఎన్నిక

కోదాడఅర్బన్ : ఎస్టీయూ కోదాడ మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మైలారిశెట్టి వీరేంద్రవర్మ, ప్రధాన కార్యదర్శిగా వల్లూరి చంద్రశేఖర్, ఆర్థిక శాఖ కార్యదర్శులుగా బి.శ్రీనివాస్, ఎ.బాలులను, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎస్.ఉపేందర్, రామచంద్రారెడ్డి, లోకేష్, ఎం.పాపారావులను ఎన్నుకున్నారు. అదేవిధంగా జిల్లా ఉపాధ్యక్షుడిగా టి.భాస్కర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బంధం వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, బీవీ, హరిప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

చిలుకూరు : చిలుకూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యేలు పద్మావతి, వేనేపల్లి చందర్‌రావులు మంగళవారం ప్రారంభించారు. అనంతరం చిలుకూరు గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు వివిధ పార్టీల నుంచి పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పిండ్రాతి హనుమంతరావు, మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

10న న్యాయవాదుల సమావేశం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని మేళ్లచెరువు బైపాస్ రోడ్డులో గల ఓ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 10న హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరి అభ్యర్థిత్వాన్ని బలపరచాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశానికి హుజూర్‌నగర్ న్యాయవాదులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు.

ఓటర్లకు అవగాహన



తుంగతుర్తిలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మోడల్ వీవీ ప్యాట్

తుంగతుర్తి : వీవీ ప్యాట్లపై తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో వివరించారు.